క్లుప్తంగా

అభివృద్ధి పనులకు తీర్మానాలు



మాట్లాడుతున్న చైర్మన్ భిక్షపతి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి పనులకు పలు తీర్మానాలు చేసినట్లు చైర్మన్ గీస భిక్షపతి తెలిపారు. శనివారం నిర్వహించిన పాలక మండలి సమావేశంలో ఆలయ రాజగోపురం ఎదుట కొబ్బరి కాయలు విక్రయ వేలం రద్దు, ఆంజనేయ స్వామి ఆలయం వద్ద తాత్కాలిక షెడ్డు, ఒడి బియ్యం టికెట్ ధర పెంపు, ఆర్చి గేటు పక్కన వసతి గదులు, ధనిగొండ కొమురయ్య వసతి గదులు తొలగించి వాటి స్థానంలో సీసీ రోడ్డు ఏర్పాటు తదితర పనులపై చర్చించారు. 23న అనుబంధ దేవాలయాలు గణపతి దేవాలయం, భద్రకాళి, వీరభద్ర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ, అభిషేకం లడ్డూ ధర రూ.100కు పెంపుపై ఆమోదం చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఈఓ బాలాజీ, ధర్మకర్తలు శ్రీనివాస్, నర్ర రఘువీరారెడ్డి, చెట్కూరి తిరుపతి, కాసర్ల కనుకరాజు, ఎర్రగొల్ల మల్లేశం, గడ్డం మహేష్‌యాదవ్, పచ్చిమడ్ల సిద్దిరాములు గౌడ్, నమిరెడ్డి సౌజన్య, ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్, రామంచ, చిన్నకోడూరు పాఠశాలలను శనివారం ఎంఈఓ దేశిరెడ్డి సందర్శించారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులను చైతన్యం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందుతుందని, ప్రైవేట్ పాఠశాలలకు పంపించి ఆర్థికంగా ఇబ్బందులకు గురికావొద్దని సూచించారు. విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, సీఆర్పీలు తిరుపతి, మహేశ్, మాధవీలత, రజిత తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 303 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు సర్టిఫికెట్లను పరిశీలించి ఐడీ, పాస్‌వర్డ్ అందజేశారు. ఐడీ, పాస్‌వర్డ్ పొందిన విద్యార్థులు నచ్చిన వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యనారాయణ సారంగపాణి, నితిన్‌పవార్, సంధ్యారాణి, శ్రీనివాస్, విజయ్‌కుమార్, కవిత, విద్యాసాగర్, రాజమౌళి, జ్యోతి, రాజు పాల్గొన్నారు.

బ్యాంక్‌మిత్ర వద్ద పాస్‌బుక్ ప్రింటింగ్ సేవలు

రాయపోలు(దుబ్బాక): ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లో ఇదివరకు ఎప్పుడు లేనివిధంగా బ్యాంక్ మిత్ర దగ్గరే పాస్‌పుస్తకం ప్రింటింగ్ సేవలను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్ ద్వారా ప్రారంభిస్తున్నట్లు దౌల్తాబాద్ బ్రాంచ్ మేనేజర్ అనిల్ అన్నారు. మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో బ్యాంక్ మిత్ర వద్ద శనివారం మైక్రో ఏటీఎం ద్వారా పాస్‌పుస్తకం ప్రింటింగ్ సేవలను ప్రారంభించారు. అలాగే బ్యాంక్ మిత్రస్థాయిలో అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన తదితర పథకాల సేవలు అందించబడతాయని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి, బ్యాంక్ సిబ్బంది అజయ్, రష్మి, భవాని, శంకర్, వెంకటేశ్‌తో పాటు బ్యాంక్ మిత్ర అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

మర్కూక్(గజ్వేల్): మండలంలోని ఎర్రవల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యావలంటీర్లకు వేతనాలు అందించడానికి తమవంతు సాయంగా డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి శనివారం రూ. 50 వేలు విరాళంగా అందించారు. సర్పంచ్ భాగ్యభిక్షపతి స్థానిక నాయకులతో కలిసి అంజిరెడ్డిని కలిసి విషయం తెలుపగా వెంటనే స్పందించారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా అడగానే స్పందించిన అంజిరెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, మల్లేశం, నవీన్‌రెడ్డి, శ్రీశైలం, నవీన్, రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లెల్లో వైద్య సేవలేవి?

- నమయపాలన పాటించని సిబ్బంది
- మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు గాలికి..
- పట్టించుకోని వైద్యాధికారులు



అక్కన్నపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అక్కన్నపేట(హుస్నాబాద్): మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న పేదప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేందుకు చేపట్టిన 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే దీనికి నిదర్శనం. 24 గంటల వైద్యసేవలు చేపట్టాలన్న మంత్రి హరీశ్‌రావు ఆదేశాల అమలుకు నోచుకోలేదు. ఐదారు నెలల కింద హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీలో భాగంగా ఆదేశాలను జారీ చేశారు. కానీ ఉదయం 9 గంటలకు వచ్చి సాయంత్రం 4 గంటలకు ఆరోగ్య కేంద్రానికి తాళం వేసి సిబ్బంది వెళ్లిపోతున్నారు. సిబ్బంది సమయపాలన పాటించడం లేదని రెండ్రోజుల కింద జరిగిన సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు సభలో వైద్యాధికారులను నిలదీశారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కింద ఎక్కువగా గిరిజన తండాలు, మారుమూల పల్లెలు ఉండడంతో ఏదో ఒక ఆరోగ్య సమస్యతో ప్రజలు నిత్యం ఆస్పత్రికి వస్తువుంటారు. కాగా ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కింద 17 గ్రామాలు ఉంటాయి. 04(అక్కన్నపేట, కట్కూర్, మల్లంపల్లి, జనగాం) ఉపకేంద్రాలు కూడా ఉన్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇటీవల అక్కన్నపేట మండల కేంద్రంలో పాముకాటుకు గురికాగా సకాలంలో వైద్యం అందుబాటులో లేక మృత్యువాతపడ్డారు. అదేవిధంగా వారం రోజుల కిందట మండల కేంద్రంలో మూలమలుపు వద్ద కారు ప్రమాదానికి గురికాగా ముగ్గురు యువకులు గాయాలపాలయ్యారు. రాత్రి సమయంలో ప్రమాదం జరగడంతో స్థానిక పీహెచ్‌సీలో వైద్యసేవలు లేకపోవడంతో హుస్నాబాద్‌కు తరలించేందుకు చాలా ఇబ్బందిపడ్డారు. ఇలా చెప్పుకుంటాపోతే బోలెడు ప్రమాదాలు, సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై దృష్టి సారించి వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆదేశాలు అమలు కాలేదు



24గంటల వైద్యసేవలు చేపడతామంటూ స్వయంగా ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన ఆదేశాలు అమలు కాలేదు. రాత్రి పూట వైద్యసేవలు అందుబాటులో లేక ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు ప్రమాదాలు తరుచుగా జరుగుతున్నాయి. ప్రస్తుతం వైద్యాధికారులు సమయపాలన పాటించడంలేదు.

–ముత్యాల సంజీవ్‌రెడ్డి, సర్పంచ్, అక్కన్నపేట

సిబ్బంది కొరత ఉంది

సిబ్బంది కొరత ఎక్కువగా ఉండడంతో 24 గంటల వైద్య సేవలు అందిచలేక పోతున్నాం. ఉన్న సిబ్బంది కంటి వెలుగు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నెల తర్వాత పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది అందుబాటులోకి వస్తోంది.

–రమ్య, వైద్యాధికారి, అక్కన్నపేట మండలం

దరఖాస్తు గడువు పెంచండి



హుస్నాబాద్‌లో ధర్నా చేస్తున్న బీసీ కులవృత్తుల లబ్ధిదారులు

హుస్నాబాద్: ప్రభుత్వం అందిస్తున్న రుణ దరఖాస్తులకు ఈ నెలాఖరు వరకు గడువు పెంచాలని బీసీ కులవృత్తుల అభ్యర్థులు శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు వైఎస్సార్‌టీపీ, అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.1లక్ష రుణం ఇస్తామని ప్రకటించిందన్నారు. మీ సేవ కేంద్రాల్లో, తహసీల్దార్ కార్యాలయంలో సర్వర్ డౌన్ కావడంతో రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని తెలిపారు. సర్వర్ డౌన్ కాకుండా చర్యలు తీసుకొని వెంటనే ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వందలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం దరఖాస్తుల గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించి బీసీ కులవృత్తుల లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, పున్న సది, రవీందర్, మల్లేశం, తదితరులు ఉన్నారు.

కోహెడ(హుస్నాబాద్): బీసీ కులవృత్తుల ఆర్థికసాయం రూ.2.50లక్షలకు పెంచి, దరఖాస్తు గడువు పొడిగించాలని కోరుతూ బీఆర్‌ఎస్ బీసీ సెల్ జిల్లా నాయకుడు పిడిశెట్టి రాజు అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరు జాప్యంపై బీసీ లబ్ధిదారులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజయ్య, ఆంజనేయులు, రవీంద్రచారి, పరశురాములు, భూమయ్య, లక్ష్మి, వనిత, రేణుక, సరస్వతి, కనకవ్వ పాల్గొన్నారు.

సన్మానం



సాయి అశ్రిత్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత తదితరులు

హుస్నాబాద్: యూపీఎస్ నిర్వహించిన సివిల్ సర్వీస్‌లో జాతీయ స్థాయిలో హన్మకొండ గ్రామ నివాసి శాఖమూరి అమరలింగేశ్వర్ కుమారుడు సాయి అశ్రిత్ 40వ ర్యాంక్ సాధించి ఐఏఎస్‌కు ఎంపికైన సందర్భంగా శనివారం పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, సన్నిహితులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సాయి అశ్రిత్ మొదటి ప్రయత్నంలోనే సివిల్ సర్వీస్ సాధించడం యువతకు ఎంతో ఆదర్శనీయమని కొనియాడారు. అనంతరం సాయి అశ్రిత్ మాట్లాడుతూ.. సివిల్ సర్వీస్‌కు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు పట్టుదలతో నిరంతరం శ్రమించినట్లయితే మొదటి ప్రయత్నంలో కూడా మంచి ర్యాంక్ సాధించొచ్చని తెలిపారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవలందించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ పద్మ, మాజీ ఎంపీపీ వెంకట్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్ తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన సిద్దోళ్ల లక్ష్మి అనారోగ్యం బారినపడి ఆస్పత్రిలో చికిత్స పొందగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్‌గౌడ్, అహ్మద్, నిజాముద్దీన్, బాలయ్య, నరేశ్, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి

నంగునూరు(సిద్దిపేట): మంత్రి హరీశ్‌రావు సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణా శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మమత అన్నారు. శనివారం నంగునూరులో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 40 రోజుల పాటు నిర్వహిస్తున్న శిబిరంలో మహిళలు కుట్టు మిషన్ నేర్చుకొని స్వయం ఉపాధి పొందాలన్నారు. ఎంపీటీసీ సునిత, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌గౌడ్, శోభ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన చేర్యాల డివిజన్ కమిటీ సమావేశంలో రవి మాట్లాడుతూ.. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న క్రమంలో పైచదువులకు వెళ్లే విద్యార్థినీ, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల కాకపోవడంతో కళాశాలల యాజమాన్యం పూర్తి ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్స్ ఇస్తామంటూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. దీంతో ఫీజు చెల్లించలేని పేద, మధ్యతరగతి విద్యార్థుల విద్యా భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్, కార్యదర్శి దాసరి ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి నాచారం శేఖర్, డివిజన్ కార్యదర్శి భాస్కర్, నాయకులు మధు, కిరణ్ పాల్గొన్నారు.

కార్మికులను మోసం చేస్తూ అక్రమ వసూళ్లు



బీడీ కార్మికులతో మాట్లాడుతున్న భాస్కర్

మిరుదొడ్డి(దుబ్బాక): బీడీ కార్మికులకు అందజేస్తున్న చిప్స్ ప్యాకెట్లను వెంటనే రద్దు చేయాలని బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడ్డుబర్ల భాస్కర్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొండాపూర్ దేశాయి బీడీ బ్రాంచిలో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం బీడీ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండాపూర్ దేశాయి బ్రాంచ్‌లో సుమారు 300 మంది బీడీ కార్మికులకు టేకేదారు బలవంతంగా చిప్స్ ప్యాకెట్లు అంటగడుతూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులు చిప్స్ ప్యాకెట్లు వద్దని వాదిస్తే ఆకు తంబాకు బంద్ చేస్తామని బెదిస్తున్నారని మండిపడ్డారు. పీఎఫ్ నంబర్ పేరుతో బీడీ కార్మికుల అనైక్యతను ఆసరా చేసుకుంటున్న టేకేదార్లు ఒక్కో బీడీ కార్మికుల నుంచి సుమారు రూ.7వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ వసూళ్లతో పాటు బలవంతంగా అంటగడుతున్న చిప్స్ ప్యాకెట్లకు చెక్‌పెట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే బీడీ కార్మికులతో కలిసి దుబ్బాక దేశాయి బీడీ కంపెనీ ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మద్దెల అంజయ్య, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

యువతి వివాహానికి ఆర్థికసాయం

తొగుట(దుబ్బాక): మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి తోయేటి కనకవ్వ కిష్టయ్య దంపతుల కూతురు మమత వివాహానికి అదే గ్రామానికి చెందిన దిన ఇరుకోటి బాలయ్య చేయూత అందించాడు. పేద కుటుంబానికి చెందిన ఆ దంపతులు వివాహం చేసేందుకు చేతిలో డబ్బు లేక ఇబ్బంది పడుతుండగా విషయం తెలుసుకున్న ఇరుకోటి బాలయ్య రూ.లక్ష సాయం అందించాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లం పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



మద్దూరు(హుస్నాబాద్): గిరిజన మహిళలతో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



అక్కన్నపేట: మల్‌చెర్వుతండాలో నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు, ఎంపీపీ లక్ష్మి



దుబ్బాకరూరల్: బోనం ఎత్తుకున్న ఎంపీపీ పుష్పలత

మద్దూరు(హుస్నాబాద్): గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. శనివారం దూల్మిట్ట మండలంలోని హనుమతండాల్లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గిరిజన అభివృద్ధి దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడకముందు గిరిజన తండాలను పట్టించుకునే నాథుడే లేడన్నారు. తాగునీరు, సాగునీరు, నిత్యం కరెంట్, రహదారులు, రైతుబంధు తదితర కార్యక్రమాలతో సీఎం కేసీఆర్ గిరిజనులకు అండగా నిలుస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీల మాయలను గిరిజనులు నమ్మరని రాష్ట్రంలో మూడోసారి సీఎం కేసీఆర్ విజయం సాధించడం ఖాయమన్నారు. అంతకుముందు గిరిజన మహిళలతో కలిసి ఎమ్మెల్యే నాట్యం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, మద్దూరు, దూల్మిట్టల బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి, సర్పంచ్‌లు జాటోత్ రేణుక కళరాం, సుజాత, శ్రీనివాస్, రేఖశ్రీనివాస్, నాయకులు దుబ్బుడు దీపికవేణుగోపాల్‌రెడ్డి, చేర్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు సాయిలు, నాయకులు పాల్గొన్నారు.

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలంలోని లింగాయపల్లి తాండాలో గిరిజనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ లంబాడి దేవి, పంచాయతీ కార్యదర్శి ప్రత్యూషల ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలు బోనాలతో ఉత్సవాలు చేశారు. స్థానికంగా ఉన్న ఆలయంలో పూజలు చేశారు. ఈ ఉత్సవాల్లో ఎంపీఓ గఫూర్‌తో పాటు ప్రత్యేకాధికారి, జీపీ సభ్యులు హాజరయ్యారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): సీఎం కేసీఆర్ సారథ్యంలో 'మా తండాల్లో మా రాజ్యం'తో ఇప్పుడు కళకళలాడుతున్నాయని ఎంపీపీ మాలోతు లక్ష్మి పేర్కొన్నారు. అక్కన్నపేట మండలంలోని 08 గిరిజన తండాలు నూతన గ్రామాలుగా కొనసాగుతున్నాయని, ఈ నేపథ్యంలో శనివారం గిరిజనోత్సవం కార్యక్రమాన్ని మండలంలోని మల్‌చెర్వు తండా గ్రామంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ భోగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజన ఆట, పాట వారి సంప్రదాయ దుస్తులు ధరించుకొని చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, సర్పంచ్ మల్లేశ్, పంచాయతీ కార్యదర్శి రవీందర్, ఉపసర్పంచ్ శారదశ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, శంకర్‌నాయక్, రంగనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ ఉమ, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం జేపీ తండాలో గిరిజన దినోత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి బంజారా పాటలు, నృత్యాలతో వేడుకలు నిర్వహించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న గిరిజనులను సన్మానించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుక్యా భిక్షపతినాయక్, ఎంపీడీఓ వేణుగోపాల్, ఎస్‌ఐ రాజుగౌడ్, లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాస్, సంపత్ పాల్గొన్నారు.

దుబ్బాకరూరల్: మండలంలోని వెంకటగిరితండాలో గిరిజనోత్సవం నిర్వహించారు. ఎంపీపీ పుష్పలత ఉత్సవంలో పాల్గొని గిరిజన మహిళలతో ఆడిపాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంటవ్వ, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సంతోషీమాత ఆలయ పాలకవర్గం ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని ప్రముఖ ఆలయం సంతోషీమాత ఆలయ నూతన పాలకవర్గాన్ని మంత్రి హరీశ్‌రావు శనివారం ప్రకటించారు. చైర్మన్‌గా మంకాల నవీన్‌కుమార్, పాలకవర్గ సభ్యులుగా గాదగోని సత్యనారాయణగౌడ్, కామిని ప్రభాకర్, కొమురవెల్లి కల్యాణి, చకిలం అమర్‌నాథ్, గరిపల్లి సువర్ణ ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ఆలయ అర్చకుడు మధుసూదన్‌ను ప్రకటించారు.

◆ విద్యార్థులకు నోట్‌బుక్స్, ప్యాడ్స్ అందజేత

దుబ్బాకటౌన్: సిద్దిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుబ్బాక మున్సిపల్ పరధిలోని ధర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 120 మంది విద్యార్థులకు శనివారం నోట్‌బుక్స్, ప్యాడ్స్, పెన్నులు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ వినోద్ మొదాని, జిల్లా అధ్యక్షుడు గంప రమేశ్, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, చీకోటి చంద్రశేఖర్, హెచ్‌ఎం ఆస నాగభూషణం, ఉపాధ్యాయులు అనీల్‌కుమార్, విష్ణువర్ధన్, సాదత్ అలీ, శ్రీదేవి, కేవీకేచారి, నరేందర్, కృష్ణమూర్తి, శ్రీకాంత్, బాలకృష్ణ, పద్మావతి, చంద్రశేఖర్, రాజేందర్, సీఆర్పీ నవీన్‌కుమార్, రేణుక ఉన్నారు

◆ ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా బోధన అందిస్తున్నామని జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి భగవంతయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శనివారం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పూర్ణిమ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

హుస్నాబాద్: ప్రశ్నించే గొంతుకలైన ప్రొఫెసర్ హరగోపాల్, పాత్రికేయ ఆచార్యులు, ప్రొఫెసర్ పద్మజాషా, విమలక్కతో పాటు 152 మంది ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి, ఉపచట్టం రద్దు చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు మేకల వీరన్నయాదవ్ ఒక ప్రకటన విడుదల చేశాడు. తెలంగాణ రాష్ట్రంలో పౌర, ప్రజాస్వామిక హక్కులు కాలరాయబడుతూ ప్రశ్నించే గొంతుకలను అణచి వేయడానికి నిర్బంద చట్టాలను ప్రయోగిస్తుందన్నారు.

◆ పట్టణ ప్రగతిలో ఒరిగిందేమి లేదు

హుస్నాబాద్: పట్టణ ప్రగతిలో పేద ప్రజలకు ఒరిగిందేమి లేదని, పాలకులే ఆర్థికంగా ప్రగతి సాధించారని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గడిపె మల్లేశ్ అన్నాడు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల పేరుతో పట్టణ ప్రగతిలో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా చేయడం సరికాదన్నాడు. ఇంటింటికీ ఉచితంగా తాగునీరు అందిస్తున్నామని చెబుతూ మూడు సంవత్సరాల నీటి పన్నులు చెల్లించాలని ఆర్థిక భారమేసి నీటి పన్నుల బిల్లులు వసూల్ చేస్తున్నారని మల్లేశ్ ఆరోపించాడు.

◆ శిఖం భూమిని కాపాడాలి

రాయపోలు(దుబ్బాక): అన్యాక్రాంతమైన చెరువు శిఖం భూమిని కాపాడాలని రాయపోలు మండలం వీరారెడ్డిపల్లి గ్రామస్తులు తహసీల్దార్ ఉమారాణికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని చౌదరి చెరువు శిఖం సర్వే నంబర్ 147లోని 1 ఎకరం 30 గుంటల భూమిని స్థానిక సర్పంచ్ కొమురయ్య కొడుకు మల్లేషం అన్యాక్రాంతం చేసి రూ.70లక్షలకు విక్రయించాడని, దీన్ని అడ్డుకొని శిఖాన్ని కాపాడాలని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ విచారణ చేయించి చర్యలు తీసుకుంటామన్నారు.

◆ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు

కొమురవెల్లి(సిద్దిపేట): రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండలంలోని వివిధ పార్టీల నాయకులతో తహసీల్దార్ లక్ష్మినారాయణ అఖిల పక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ నియోజకవర్గంలోని కొమురవెల్లి మండలంలో గల పోలింగ్ స్టేషన్లలో తొలగింపులు, చేర్పులపై చర్చించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, టీడీపీ, నాయకులు పాల్గొన్నారు.

◆ ఎస్‌ఐకి సన్మానం

మిరుదొడ్డి(దుబ్బాక): సీఐగా పదోన్నతి పొందిన మిరుదొడ్డి ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్‌ను బీఆర్‌ఎస్ నాయకులు శనివారం సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ ఎండీ.అహ్మద్, జిల్లా నాయకుడు సూకూరి లింగం, మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, గొట్టం రాధాకృష్ణ, మల్లయ్య, మద్దెల చంద్రం తదితరులు ఉన్నారు.

◆ భెల్ ఫార్మా ప్రారంభం

మర్కూక్(గజ్వేల్): మండలంలోని కర్కపట్ల గ్రామ సమీపంలో శనివారం బయోటెక్నాలజీ పార్క్ మూడో దశలో భాగంగా భెల్ ఫార్మా స్యూటికల్స్, ఆర్మా డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అరబిందో ఫార్మా అధినేత మదన్‌మోహన్‌రెడ్డి, వింట ల్యాబ్స్ వ్యవస్థాపకుడు డా.వాసిరెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరాన్ని ఔషధ తయారీ రంగంలో మొదటి స్థానంలో ఉంచేందుకు ఎమ్‌ఎస్‌ఎమ్ తరహా పరిశ్రమలు ప్రారంభించాలన్నారు. డిప్యూటీ డ్రగ్ కంట్రోల్ అధికారి డా.రామకిషన్ మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాలు పాటించే ప్రతీ తయారీదారుడికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అఖిల, సతీశ్ కుమార్‌రెడ్డి, రాంబాబు, మధుసూదన్‌రెడ్డి, సీఈఓ సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థికి అభినందన

కొండపాక(గజ్వేల్): గురుకుల పాఠశాలలో సీటు సంపాదించడం గొప్ప విషయమని పీఎన్‌ఆర్ ట్రస్టు వ్యవస్థాపకుడు పొల్కంపల్లి నరేందర్ పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన విద్యార్థినీ పాల రక్షిత గురుకుల పాఠశాలలో అర్హత సాధించింది. దీంతో హెచ్‌ఎం కే.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థినిని అభినందిస్తూ రవాణా చార్జీలు, ఇతరాత్ర ఖర్చుల నిమిత్తం నగదుగా డబ్బులను అందించి మెడల్‌తో సత్కరించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లం ఐలయ్య, ఉపాధ్యాయులు పద్మ, రాంచంద్రం, శంకర్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

◆ ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్: నిబంధనలు పాటించకుండా పాఠశాలలు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడికొండ రవి డిమాండ్ చేశాడు. శనివారం పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ హుస్నాబాద్ డివిజన్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నాయని, జిల్లా అధికారులు ఫీజులను నియంత్రించాలని రవి డిమాండ్ చేశాడు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్, కార్యదర్శి ప్రశాంత్, నాయకులు శేఖర్, రిషి, సాయిదీక్షిత్ పాల్గొన్నారు.

◆ రెవెన్యూ అధికారులపై చర్య తీసుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): విధులపట్ల నిర్లక్ష్యంగా వహిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం జిల్లా కార్యదర్శి సోగాల మనోజ్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యాంగా వెళ్లిపోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా వారికి కులం, ఆదాయం, నివాసం తదితర సర్టిఫికెట్లు కోసం కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండిపడ్డారు.